## క్లుప్తంగా

### తానా సభలకు ఆహ్వానం


వరలక్ష్మి

అగనంపూడి: వచ్చే నెల 7 నుంచి 9వ తేదీ వరకు అమెరికాలోని ఫిలడెల్ఫియాలో నిర్వహించనున్న తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) సభల్లో పాల్గొనేందుకు 79వ వార్డు బోనంగికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయిని ఎస్.ఎన్.ఎస్.వరలక్ష్మికి తానా కమిటీ ఆహ్వానం అందింది. తెలుగు భాష, సాహిత్యంపై ఆమె చేస్తున్న కృషిని అభినందిస్తూ తానా 23వ సదస్సులో పాల్గొనాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. వరలక్ష్మి పరవాడ మండలం వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్నారు. తానా 46వ వార్షికోత్సవంలో పాల్గొని తెలుగు సాహిత్యం, తెలుగు భాష గొప్పదనం వివరించాలని ఆమెను కమిటీ కోరింది.

### కృష్ణావతారంలో జగన్నాథస్వామి


కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథస్వామి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని ఇంద్రద్యుమ్న హాలు వద్ద వేంచేసియున్న జగన్నాథస్వామి మంగళవారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు గురు సంతోష్ జగన్నాథస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. మహిళలు ఉదయం విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. సాయంత్రం దాన బోయినపాలేనికి చెందిన సీతారామాంజనేయ భజన మండలి సభ్యులు భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ జెర్రిపోతుల సోమునాయుడు, ప్రతినిధులు గెద్దాడ సత్యవతి, పి.దేవరాజు, సన్యాసమ్మ, శ్రీను బాబు, ఆలయ పూర్వీకులు గురు త్రినాథ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు సత్కారం

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లోని అగనంపూడి ప్రాంతంలో పాఠశాలలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను స్థానిక ప్రజా సంఘాలు ఘనంగా సత్కరించాయి. బదిలీపై వచ్చి, అగనంపూడి ప్రాంతంలో చేరిన 8మంది ఉపాధ్యాయులను దువ్వాడ రైల్వేస్టేషన్ కన్సల్టెంట్ కమిటీ సభ్యుడు కొలిపాక అప్పారావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ అభినందించి, సత్కరించారు. కార్యక్రమంలో అగనంపూడి లయన్స్‌క్లబ్ కార్యదర్శి ఆడారి వెంకటకృష్ణ, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### కిరాతవారాహిదేవిగా శ్రీమహాదుర్గ



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి దేవాలయంలో వారాహి నవరాత్రి పూజలు వైభవంగా జరుగుతున్నాయి. మహాదుర్గ అమ్మవారిని మంగళవారం కిరాతవారాహిదేవి అవతారంలో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవారికి కనకాంబరాలు తదితర పుష్పాలతో అర్చన చేశారు. ప్రయోగ బాధలు, దుష్టగ్రహ పీడా నిర్మూలన కలిగేలా చేయాలంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### 'విద్యుత్ చార్జీలు తగ్గించాలి'

పెదగంట్యాడ: ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు పెదగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మంగళవారం ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ ట్రూ అప్, ఫిక్స్‌డ్ చార్జీల పేరిట విద్యుత్ చార్జీలను పెంచడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలపై భారం పడుతోందన్నారు. ప్రభుత్వం స్పందించి పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, పల్లేటి పోలయ్య, జి.ఆనంద్, అచ్యుతరావు పాల్గొన్నారు.



# ఎనిమిదేళ్లుగా.. నిరుపయోగంగా

- సబ్ నిర్మితి కేంద్రం ప్రాంగణం
- కేంద్రం పునరుద్ధరణకు కార్మికుల వినతి
- ప్రజాప్రయోజనాలకైనా స్థలం కేటాయించాలని ప్రజా సంఘాల విన్నపం


కార్మికులకు కేటాయించిన క్వార్టర్లు


అగనంపూడిలోని సబ్ నిర్మితి కేంద్రం

అగనంపూడి: ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నడిచిన సబ్‌నిర్మితి కేంద్రం మూత పడింది. ఒకవైపు 30 మంది కార్మికులు ఉపాధి కోల్పోగా, మరోవైపు విశాలమైన ప్రాంగణం నిరుపయోగంగా ఉంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటైన అనంతరం.. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం వివిధ నిర్వాసిత కాలనీల్లోని ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇటుకలను తయారు చేయడానికి హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో అగనంపూడి జాతీయ రహదారిని ఆనుకుని మూడున్నర ఎకరాల స్థలంలో సబ్‌నిర్మితి కేంద్రాన్ని నిర్మించారు. అగనంపూడి, పెదగంట్యాడ, వడ్లపూడి, గంగవరం నిర్వాసిత కాలనీల్లో 107 గజాల స్థలంలో ఇళ్ల నిర్మాణానికి పాల్జీ ఇటుకలు, సిమెంట్ స్తంభాలు తయారు చేసి సరఫరా చేసేవారు. రైల్వే ట్రాక్ నిర్మాణానికి అవసరమైన సిమెంట్ ర్యాపర్లు తయారు చేసేవారు. సిమెంట్, ఫ్లై యాష్ ఇటుకలతో పాటు సిమెంట్ స్తంభాలు తయారు చేసేవారు. సుమారు 30 మంది కార్మికులు ఈ సంస్థలో కాంట్రాక్ట్ కార్మికులుగా విధులు నిర్వహించేవారు. కాలక్రమంలో సబ్ నిర్మితి కేంద్రంలో శానిటరీ బేసిన్లు తయారు చేసేవారు. ఇక్కడి తయారైన వస్తువులకు అప్పట్లో మార్కెట్ ఉండడంతో సిమెంట్‌తో తయారు చేసిన వస్తువులు అమ్మేవారు.

**ప్రత్యామ్నాయం చూపని గత ప్రభుత్వం**

ఫ్లైయాష్‌తో తయారు చేసే ఇటుకల యూనిట్లు విరివిగా పుట్టుకురావడంతో సబ్ నిర్మితి కేంద్రానికి వర్క్ ఆర్డర్లు తగ్గడంతో, పదేళ్ల నుంచి పనులు మందగించాయి. కాలక్రమంలో ఫ్లైయాష్‌తో తయారు చేసే ఇటుకలు ప్రతీగ్రామంలో పుట్టుకురావడంతో ఎనిమిదేళ్ల క్రితం సబ్ నిర్మితి కేంద్రాన్ని మూసివేశారు. గత ప్రభుత్వం స్పందించి, వీటికి ప్రత్యామ్నాయంగా యూనిట్‌ను తయారు చేస్తే అనేకమందికి ఉపాధి కొనసాగేది. ప్రస్తుతం సరైన పని లేక కార్మికులు కూలి పనులు చేసుకుంటున్నారు. వారు ఇదే ఆవరణలో నివాసముంటున్నారు. ఆవరణలో గుబురుగా ముళ్ల పొదలు, చెట్లు పెరిగి విషసర్పాలు, క్రిములు కీటకాలకు కేంద్రంగా మారింది. వీటికి ఒక పక్క 85ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, మరోపక్క ఆర్టీఏ కార్యాలయం ఉన్నాయి. గుబురుగా పెరిగిన ముళ్ల పొదల నుంచి విష సర్పాలు ఈ ఆవరణల్లోకి చొరబడుతున్నాయని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సబ్‌నిర్మితి కేంద్రం పునరుద్ధరించాలని, వీలు కాని పక్షంలో వేరే ప్రజా ప్రయోజనానికి ఉపయోగించాలని స్థానికులు కోరుతున్నారు. రైతుబజారు ఏర్పాటు లేదా అగనంపూడిలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని ప్రజాసంఘాలు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని, జిల్లా కలెక్టర్‌ను వినతిపత్రంలో కోరాయి.


సబ్ నిర్మితి కేంద్రంలో చెల్లాచెదురుగా పడి ఉన్న శానిటరీ బేసిన్లు

**సబ్ నిర్మితి కేంద్రాన్ని పునః ప్రారంభించాలి**

సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సామగ్రిని తయారు చేసేలా సబ్‌నిర్మితి కేంద్రాన్ని పునః ప్రారంభించాలి. 30 కుటుంబాలు వీటిపై ఆధారపడి జీవనం సాగించేవాళ్లం. ప్రస్తుతం కూలి పనులు చేసుకోడానికి బయటకు వెళ్లిపోతున్నాం.

– అప్పలనాయుడు, కార్మికుడు

**ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించాలి**

విశాలమైన ప్రాంగణాన్ని వినియోగించాలి. లేదా ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించాలి. అగనంపూడిలో రైతు బజార్ ఏర్పాటుకు ఇప్పటికే అనుమతి లభించింది. స్థానికంగా సబ్‌స్టేషన్ నిర్మాణానికి అనువైన స్థలం చూపిస్తే ఏపీఈపీడీసీఎల్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సిద్ధంగా ఉందని చెబుతుంది. అధికారులు వినియోగించని పక్షంలో ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించాలి.


– బలిరెడ్డి శ్రీను, అగనంపూడి కాలనీ

## 'గడప గడపకు..' విశేష స్పందన


లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు టీఐసీ పాయింట్ వద్ద మంగళవారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఇంటింటికీ వెళ్లారు. వారికి ఈ నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని గురించి వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, ఎన్.వై. నాయుడు, ఎస్.రాజారావు, త్రినాథ్, దుర్గారెడ్డి, నర్సీపట్నం నాయుడు, గొరుసు రామలక్ష్మి, ఒమ్మి ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల ఆర్థిక ప్రయోజనాల సాధనకు ఐక్య పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయడంలో ఉక్కు యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరిని ఐక్య ఉద్యమాలతో ప్రతిఘటిస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెయిల్‌లో జరిగిన వేతన ఒప్పందానికి స్థానిక యాజమాన్యం సాకులు చూపుతూ.. వేతనాలు అమలు చేయకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. కార్మికుల జీతభత్యాలకు కర్మాగార లాభనష్టాలతో సంబంధం ఏమిటని ప్రశ్నించారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాల సాధనకు ఐక్యంగా ప్రతిఘటిస్తామన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షుడు వై.టి.దాస్ ప్రసంగించారు. కార్యక్రమంలో పి. శ్రీనివాసరాజు, కె. గంగాధర్, కె.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల మాయలో పడొద్దు

- విద్యార్థులకు అధికారుల హితవు
- డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన


డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలు వివరిస్తున్న అధికారులు

కూర్మన్నపాలెం: మాదకద్రవ్యాల వినియోగం వల్ల జీవితం నాశనమవుతుందని, ఆ మాయలో పడవద్దని అధికారులు హితవు పలికారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లీ ఏబుల్డ్, సీనియర్ సిటిజన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడితే శరీరంలో అసమతుల్యత వల్ల అనేక నష్టాలు కలుగుతాయన్నారు. సమాజంలో అనేక ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గాజువాక సీఐ మన్మథరావు, ప్రభుత్వ మానసిక వైద్యశాల వైద్యులు ఫిరోజ్, కేజీహెచ్ కౌన్సెలర్ గాయత్రి, సునీత, సూపరింటెండెంట్ పద్మావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాశరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాలేజీ యాజమాన్యం మార్పుపై విద్యార్థుల ఆందోళన


కళాశాల ఎదుట ఆందోళనకు దిగిన విద్యార్థులు

గాజువాక: పాతగాజువాక జంక్షన్‌లోని ఒక ప్రైవేట్ కళాశాల యాజమాన్యం నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళన చేశారు. ప్రస్తుత యాజమాన్యం తమ కళాశాలను వేరే యాజమాన్యానికి అమ్మేసిందని, దీనివల్ల తమ తరగతులకు ఇబ్బంది ఎదురయ్యే పరిస్థితి ఉందంటూ విద్యార్థులు కాలేజీ వద్ద ఆందోళనకు దిగారు. తరగతులు ప్రారంభమైన తరువాత వచ్చిన కొత్త యాజమాన్యం ఫ్యాకల్టీని సరిగ్గా నిర్వహించకుంటే తాము నష్టపోతామని పేర్కొన్నారు. తాము ఎట్టిపరిస్థితుల్లోను కొత్త యాజమాన్యాన్ని అనుమతించబోమంటూ నినాదాలు చేశారు. దీనిపై కల్పించుకున్న పోలీసులు విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల యాజమాన్యంతో తల్లిదండ్రులు మాట్లాడతారని, సమస్య ఏదైనా వస్తే పరిష్కరించడానికి అనేక పద్ధతులు ఉన్నాయంటూ విద్యార్థులకు సర్ది చెప్పారు. దీంతో విద్యార్థులు ఆందోళనను విరమించి తరగతులకు హాజరైనట్టు పోలీసులు తెలిపారు.

## బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిన రోగికి సకాలంలో చికిత్స

అక్కిరెడ్డిపాలెం: పక్షవాతం లేదా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైనప్పుడు సరైన సమయంలో గుర్తించి, ఆస్పత్రిలో చేర్పించడం అవసరమని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి కన్సల్టెంట్ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ సీహెచ్.విజయ్ అన్నారు. నగరానికి చెందిన జి.అప్పారావు (40) ఉన్నట్టుండి స్పృహ కోల్పోవడంతో కుటుంబ సభ్యులు మూడు గంటల వ్యవధిలోనే కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకువచ్చారని తెలిపారు. రోగిని పరీక్షించగా కుడి కాలు బలహీనపడటం గమనించామని, ఎంఆర్ఐ చేయగా ఎడమవైపు మిడిల్ సెరెబ్రెల్ ఆర్టెరీ దెబ్బతిన్నట్లు తేలిందని చెప్పారు. గంటల వ్యవధిలోనే రోగిని ఆస్పత్రికి తీసుకురావటంతో వెంటనే ఇంజక్షన్ ఇవ్వడంతో రోగి పరిస్థితి కాస్త మెరుగుపడిందన్నారు మెదడులో ఏర్పడిన గెడ్డలను తొలగించడంతో 24 గంటల్లోనే పూర్తిస్థాయిలో కోలుకున్నాడని తెలిపారు.

## ఎమ్మెల్యే దృష్టికి అగనంపూడి సమస్యలు

అగనంపూడి: అగనంపూడిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని 85వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు యలమంచిలి అప్పారావు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కోరారు. ఎమ్మెల్యేను మంగళవారం ఆయన ఇంటి వద్ద కలిసి, మాట్లాడారు. అగనంపూడిలో రైతు బజారు ఏర్పాటు చేయాలని, డొంకాడలో అధునాతన వసతులతో కల్యాణమండపం నిర్మించాలని, దిబ్బపాలెం పాఠశాల గ్రౌండ్‌ను క్రీడా మైదానంగా తీర్చిదిద్ది, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, పలు కూడళ్లలో హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలని ఎమ్మెల్యేకు వినతి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు చుక్కవానిపాలెంలోని సర్వే నంబర్ 84 88/1లో గల ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని గ్రామంలోని పలు సంఘాల నాయకులు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడి, సామాజిక భవనం నిర్మించాలని వార్డుకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నుంచి పెట్లి వెంకటరమణ, పెట్లి వెంకటఅప్పారావు, విశ్వబ్రాహ్మణ సంఘం నుంచి అనుపోలు శ్రీనివాస్, నాయిబ్రాహ్మణ సంఘం నుంచి పాత్రపల్లి సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి వేడుకలకు ఆహ్వానం


మంత్రి బూడి ముత్యాలనాయుడుకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఆలయ కమిటీ

అగనంపూడి: వచ్చేనెల 3వ తేదీన నిర్వహించనున్న గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ అగనంపూడికి చెందిన షిర్డీ సాయి మందిరం కమిటీ రాష్ట్ర మంత్రి బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి ఎంపీ బి.సత్యవతికి ఆహ్వాన పత్రికలు అందించారు. మంత్రిని, ఎంపీని వారి కార్యాలయాల్లో కలిసి, ప్రత్యేకంగా ఆహ్వానించారు. కమిటీ ప్రతినిధులు కె.రమణారెడ్డి, ధర్మాల వ్యాసశర్మ, రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## సచివాలయంలో మేయర్ ఆకస్మిక తనిఖీ


కార్యదర్శులతో మాట్లాడుతున్న మేయర్ హరి వెంకట కుమారి

గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయాల ద్వారా పౌర సేవలు నిరంతరం అందాలని జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆదేశించారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎస్సీ కాలనీ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్యదర్శుల హాజరు మూవ్‌మెంట్ రిజిస్టర్, డైరీలతో పాటు కార్యదర్శులు వేసుకొనే డ్రెస్‌కోడ్‌ను పరిశీలించారు. పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన సచివాలయంలో సరైన సేవలు అందేలా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు. ఇళ్ల పట్టాలు, పింఛన్, జగనన్న తోడు, విద్యా దీవెన తదితర సంక్షేమ పథకాలు ప్రతి పేదవానికి అందేలా చూడాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజలు పెట్టుకున్న అర్జీలను నిర్ణీత సమయానికే పరిష్కరించేలా చర్యలు తీసుకుని, ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.

# ప్రతి విద్యార్థికీ అండగా జగన్ మామ

- కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా చదివించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే
- కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి


అగనంపూడి హైస్కూల్లో తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ వరలక్ష్మి


పేరెంట్స్ మీటింగ్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఎం కాంతం

అగనంపూడి: పేద పిల్లలకు జగన్ మామ అండగా ఉన్నారని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి అన్నారు. విద్యార్థులను కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా చదివించే బాధ్యత ముఖ్యమంత్రి జగన్ తీసుకున్నారన్నారు. అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలను నాడు–నేడు పేరుతో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. విద్యార్థులకు చదువుకోడానికి కావల్సిన అన్ని రకాల వసతులు కల్పిస్తున్న రాష్ట్రం దేశంలో మన రాష్ట్రమే అన్నారు. ముఖ్యమంత్రి పెద్ద మనసుతో బాలల సంక్షేమం, ఆరోగ్యం కోసం పాటుపడుతున్నారన్నారన్నారు. జగనన్న అమ్మ ఒడి, విద్యాకానుక, గోరుముద్ద, ఆణిముత్యాలు వంటి వినూత్న కార్యక్రమాలతో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగిందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణారావు, కమిటీ ప్రతినిధులు దాసరి సత్యవేణి, బేతా అనిత, కె.రమాదేవి, ఎస్.లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**విప్లవాత్మక సంస్కరణలు**

అక్కిరెడ్డిపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో మార్పులను తీసుకువచ్చి, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు రాష్ట్రప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను అంది పుచ్చుకుని, ఉన్నతికి చేరుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో పాఠశాల వాతావరణానికి, ప్రస్తుతం ఉన్న దానికి తేడాను గమనించాలని పేరెంట్స్‌ను కోరారు. జగనన్న విద్యా కానుక ద్వారా విద్యార్థులకు నాణ్యమైన పుస్తకాలు, 3 జతల యూనిఫాం, బ్యాగ్, షూ, బెల్టు వంటి వాటిని అందజేశారని అన్నా రు. విద్యార్థుల ఆరోగ్యం రీత్యా జగనన్న గోరుముద్ద ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నారని, కొత్తగా రాగి జావను అందిస్తున్నారని చెప్పారు. విద్యార్థులు ఈ సదుపాయాలను వినియోగించుకుంటూ, చక్కగా చదువుకునేలా ప్రోత్సహించాలని కోరారు.

## పోలీసుల పహారాలో గంగవరం పోర్టు


గంగవరం పోర్టు వద్ద మోహరించిన పోలీసులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు వద్ద మంగళవారం కూడా పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. పోర్టులో పని చేస్తున్న కార్మికులు తమ వేతనాలను పెంచాలని కోరుతూ చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో పోలీసులు ఇక్కడ బందోబస్తు నిర్వహించారు. పోర్టు నిర్వాసిత కార్మికులు తమ వేతనాల సమస్యపై కలెక్టర్‌తో కలెక్టరేట్‌లో మంగళవారం చర్చలు జరిపారు. అయితే ఈ నెల జీతానికి రూ.10 వేలు కలిపి ఇవ్వడానికి యాజమాన్య ప్రతినిధులు ఒప్పుకున్నారని చెప్పారు. అది కూడా ఈ ఒక్క నెల మాత్రమే ఇస్తామని చెప్పడంతో కార్మికులు దానికి అంగీకరించలేదు. ప్రస్తుతం ఇస్తున్న జీతాలకు రూ.10వేలు కలిపి ప్రతి నెలా ఇవ్వాలని కోరారు. దానికి కలెక్టర్ నిరాకరించడంతో కార్మికులు వెనుదిరిగారు. ఈ చర్చలు సఫలం కాకపోవడంతో పాటు రెండో రోజు కూడా కార్మికులకు పోర్టు యాజమాన్యం సెలవు ప్రకటించడంతో మరోమారు ఆందోళనలు చోటుచేసుకునే అవకాశం ఉందని ముందస్తుగానే ఇక్కడ పోలీసులను మోహరించారు. అయితే తమకు పూర్తి స్థాయిలో న్యాయం చేసే వరకూ పోరాటాలు చేస్తామని కార్మికులు స్పష్టం చేశారు.

## 'ఉక్కు' ప్రైవేటీకరణను విరమించే వరకు ఉద్యమం


శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం విరమించే వరకు ఉక్కు ఉద్యమం కొనసాగుతుందని పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 866వ రోజు మంగళవారం పలువురు కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు కార్మిక వర్గం ఎన్నో ఏళ్లుగా శ్రమించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణను విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడమే కాక ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంటును నష్టాల ఊబిలోకి నెట్టేందుకు యాజమాన్యం ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


## సెల్ఫీ స్టార్స్

**సెల్ఫీలకే పరిమితమైన టీడీపీ యాత్ర**


సెల్ఫీ తీసుకొంటున్న టీడీపీ నాయకులు

గాజువాక: గాజువాక నియోజకవర్గంలో టీడీపీ నాయకులు మంగళవారం నిర్వహించిన బస్సుయాత్ర సెల్ఫీలకే పరిమితమైంది. ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఇటీవల ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తామంటూ ఈ పాదయాత్ర తలపెట్టిన విషయం తెలిసిందే. భవిష్యత్తుకు భరోసా పేరుతో తలపెట్టిన ఈ యాత్రలో భాగంగా పాతగాజువాకలో బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం జంక్షన్‌లో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని తొలుత సందర్శించిన నాయకులు, అక్కడి నుంచి అగనంపూడి టోల్‌గేట్‌కు వెళ్లి అక్కడ సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం తుంగ్లాం రైల్వే గేటు వద్ద అసంపూర్తి వంతెనను పరిశీలిస్తున్నట్టు సెల్ఫీ, షీలానగర్‌లో ఈఎస్‌ఐ ఆస్పత్రికి కేటాయించిన స్థలానికి వెళ్లి అక్కడా సెల్ఫీలే తీసుకున్నారు. సాయంత్రం యాత్రను పునప్రారంభించిన నాయకులు గంగవరం వెళ్లేందుకు బయల్దేరగా ఆ గ్రామంలో సెక్షన్ 144 అమల్లోకి ఉందని పోలీసులు చెప్పడంతో వెనుదిరిగారు. దీంతో బీసీ రోడ్‌లో టిడ్కో గృహాలను సందర్శించి అక్కడ కూడా సెల్ఫీలే తీసుకున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు బండారు సత్యనారాయణమూర్తి, గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవింద్ సత్యనారాయణ, వంగలపూడి అనిత, కోళ్ల లలిత కుమారి, కూన రవికుమార్, ఎమ్మెల్సీలు చిరంజీవి, దువ్వారపు రామారావు, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, బొండా జగన్, గంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## 'సమస్య పరిష్కరించే వరకు అలవెన్స్ ఇవ్వలేం'


కరపత్రాలు ప్రదర్శిస్తున్న కాంట్రాక్టర్ల సంఘం నాయకులు

ఉక్కునగరం: ఈఎస్‌ఐ సమస్య పరిష్కరించే వరకు కాంట్రాక్ట్ కార్మికులకు అలవెన్సుల రూపేణా ఇచ్చే రూ.2400 చెల్లించలేమని వైజాగ్ స్టీల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు. ఉక్కు ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు 2009 నుంచి ఐఆర్‌గా రూ.300, ఎస్ఎంఏగా రూ.1000, ఏఎస్ఎంఏ రూపేణా రూ. 1100 కలిపి మొత్తం రూ.2400 చెల్లిస్తున్నామన్నారు. యాజమాన్యంతో చేసుకున్న ఒప్పందంలో ఆ అమౌంట్‌పై ఎటువంటి టాక్స్, పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారన్నారు. అయితే ఈఎస్‌ఐ అధికారులు యాజమాన్యం చెల్లిస్తున్న రూ.2400 అలవెన్సులపై కూడా ఈఎస్‌ఐ కట్టాలని నోటీసులు జారీ చేస్తోందన్నారు. యాజమాన్యం నుంచి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ నెల నుంచి అలవెన్స్ అమౌంట్ చెల్లించబోమన్నారు. ఈ అంశంపై సహకరించాలని పి.అప్పలనాయుడు, టి.చక్రధరరెడ్డి, బి.సన్యాసిరావు, ఎస్.రామకృష్ణ, ఎం.రమణరాజు కోరారు.